మందకొడిగా పన్నుల వసూళ్లు

మున్సిపాలిటీకి భారంగా ప్రభుత్వ కార్యాలయాలు



మునిసిపల్ కార్యాలయ భవనం

నరసాపురం: మున్సిపాలిటీలో పన్నుల వసూళ్ల మందకొడిగా సాగుతోంది. ఆర్థిక సంవత్సరం ముగిసినప్పటికీ పన్నుల వసూళ్ల వేగం పుంజుకోలేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి చివరి నాటికి పట్టణంలో మొత్తం రూ.5.48 కోట్లు ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా, జూన్ 30 వరకూ రూ.1.60 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. ఇంకా రూ.3.88 కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉంది. మున్సిపల్ రెవెన్యూ అధికారుల తాత్సారం, నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వస్తున్నాయి. డిమాండ్ నోటీసులు సకాలంలో అందించకపోవడం, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం వంటి కారణాలు లోపాలుగా కనిపిస్తున్నాయి. పన్నులు చెల్లించమని కనీసం మైక్ ప్రచారం కూడా చేసిన దాఖలాలు లేవు. మరి రానున్న రోజుల్లో ఎంతమేర వసూళ్లు చేపడతారనేది వేచి చూడాలి.

భారంగా ప్రభుత్వ కార్యాలయాలు...

ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్నులు మున్సిపాల్టీకి సజావుగా జమ కావడం లేదు. గవర్నమెంట్ ఆఫీసుల నుంచి పన్నులు రాకపోవడంతో, సంబంధిత శాఖల నుంచి డబ్బు ఎలా వసూలు చేయాలో తెలియక మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. డివిజన్ కేంద్రమైన నరసాపురంలో వివిధ ప్రభుత్వ శాఖల డివిజనల్ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాల నుంచి మున్సిపాలిటీకి వడ్డీతో కలిపి రూ.69 లక్షల వరకూ పన్ను బకాయిలు రావాల్సి వుంది. కొన్ని శాఖల నుంచి అడపా దడపా కొంత మొత్తం వసూలు అవుతున్నా కూడా, పూర్తి స్థాయిలో మాత్రం పన్ను వసూలు కావడం లేదని మున్సిపల్ వర్గాలు చెబుతున్నాయి. మున్సిపాలిటీలో పన్నుల చెల్లింపులో ఆయా శాఖల అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. గత ఏడాది మొత్తం ప్రభుత్వ కార్యాలయాల నుంచి కేవలం రూ.5 లక్షలు మాత్రమే మున్సిపాలిటీకి పన్నుల చెల్లింపులు జరిగాయి.

చర్యలు తీసుకుంటున్నాం

బాకీల వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో స్పెషల్ డ్రైవ్ చేపడతాం. సిబ్బందిని అన్ని వీధులకు తిప్పి పన్నులు రాబట్టే ప్రయత్నం చేస్తాం. నూరు శాతం వసూళ్లకు చర్యలు తీసుకుంటాం. బాకీలు ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు పంపించాం. బాకీల వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేయమని కోరాం. అంతకీ వసూలు కాకపోతే, మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు చేపడతాం.

–సీహెచ్ నానాజీ, మున్సిపల్ ఆర్ఐ

ఉపాధి హామీలో పంట బోదె తవ్వకం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టారు. మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంటేటివారిపేట, పాలకమ్మచెరువు ప్రాంతాలతోపాటు కేపీపాలెం సౌత్, నార్త్ గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాలువలు వదిలినా పూర్తి స్థాయిలో నీరు లేకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగు నీరు ప్రవహించడం లేదు. మరోవైపు పంటబోదెల్లో మట్టి, గుర్రపు డెక్క నిలిచిపోవడంతో ఉన్న నీరు దిగువ ప్రాంతంలోని భూములకు అందడం లేదు. దీంతో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. మంగళవారం కేపీ పాలెం సౌత్‌లో చేపట్టిన పంట బోదె తవ్వకం పనులను జేఈ ఆనంద్ పరిశీలించి కూలీలకు పలు సూచనలు అందజేశారు.

మొక్కలతోనే పర్యావరణ రక్షణ



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నరసాపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, వాటి పెంపకం ఆవశ్యకతను ప్రతీ ఒక్కరూ గుర్తించాలని వైఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు సూచించారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: అమ్మ పేరుతో మొక్క నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండంటూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు కొంతేరులో బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్థి మంగళవారం మొక్క నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుగొండ: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచనల మేరకు అమ్మ పేరుతో మొక్కను వడలిలో ప్రారంభించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ తెలిపారు. మంగళవారం పర్యావరణ పరిరక్షణ కోసం మన్ కీ బాత్‌లో పీఎం ప్రధాని ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



పాలకొల్లు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు అర్బన్: స్థానిక రోటరీ క్లబ్ 2024–25 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ సభ్యులను రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ పెనుమాక రామ మోహనరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఉల్లంపర్రుకి చెందిన రావాడ సతీష్, కార్యదర్శిగా జవ్వాజి కల్యాణ్, కోశాధికారిగా పోతాబత్తుల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా సంస్థ ద్వారా ఏడాది కాలం తమకు సేవ చేసే అవకాశం కల్పించిన రోటరీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శ క్లబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మద్దాల శ్రీనివాస్, మద్దాల రాంప్రసాద్, కఠారి నాగేంద్ర కుమార్, ఇమ్మిడి రాజేష్, కావలి నగేష్, మైగాపుల రాంబాబు, గన్నాబత్తుల శ్రీనివాస్, శిరిగినీడి శ్రీరామనాగార్జున, ముత్యాల శ్రీవాత్సవ్, కానూరి ప్రభాకర్, ఎస్ఎస్.మూర్తి, పలివెల శివ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ అడ్మిషన్ల గడువు జూలై 10



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎన్ఎం) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. మంగళవారం కళాశాలలో గ్రూపులపై వివరించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని డిగ్రీలో కొనసాగాలనుకునే విద్యార్థులకు ఏఎస్ఎన్ఎం కళాశాల అడ్మిషన్లు ప్రారంభించిందన్నారు. జులై 10 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో ఉచిత సౌకర్యం కల్పించామన్నారు. అలాగే కళాశాలలు ఎంపికకు జులై 11 నుంచి 15 వరకూ వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. జులై 19న సీట్ల కేటాయింపు చేస్తారని తెలిపారు. అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు జులై 20 నుంచి 22 లోపు కళాశాల నందు రిపోర్ట్ చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరానికి 9 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్ బీకామ్ (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్), బీఎస్సీలో మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ ఉన్నాయన్నారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం అనంతరం మంచి ఉద్యోగం పొంది తమ కలను సాకారం చేసుకోవాలన్నారు.

ముద్ద చర్మ వ్యాధికి వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ అధికారిణి భార్గవీ సత్య

ఆకివీడు: ఆవులలో వచ్చే ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డీసీజ్)కి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ వేస్తామని మండల వెటర్నరీ అధికారిణి కెల్లా భార్గవీసత్య తెలిపారు. మండలంలో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4 నెలల ఆవు దూడ నుంచి ప్రతీ పశువుకూ ఇంటింటికీ వచ్చి వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. ఇది వైరల్ వ్యాధి అని, ఈ వ్యాధి సోకిన పశువు తీవ్ర జ్వరం, చర్మంపై పెద్ద పెద్ద బొడుపులు వస్తాయన్నారు. తరువాత అవి పగిలి గాయాలుగా మారి రక్తం కారుతుందన్నారు. కాళ్లు వాచి నడవ లేదని, పాల దిగుబడి తగ్గిపోతుందని, మేత తినకుండా కొన్ని సందర్భాల్లో పశువు చనిపోతుందని భార్గవి వివరించారు. రక్తం తాగే కీటకాల వల్ల ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాప్తి చెందుతుందన్నారు. ముక్కు, నోటి నుంచి వచ్చే స్రవాల వల్ల కూడా వ్యాధి వ్యాప్తి చెందుతుందని చెప్పారు. పశువుల రక్షణకు ప్రతీ రైతూ టీకాను వేయించాలని విజ్ఞప్తి చేశారు.

అల్లూరి ఆశయాలు నెరవేర్చాలి



అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): సాహస గాధలను భావి తరాలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని, స్వాతంత్ర్య ఉద్యమంలోని ఘట్టాలు బ్రిటిష్ వారిని సైతం ఆశ్చర్య పరిచాయని యూత్ హాస్టల్స్ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిలుకూరి నరసింహరాజు అన్నారు. విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీవిజ్ఞాన వేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ, దేశ భక్తి ప్రతిజ్ఞ, పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ మన ప్రాంతంలో 125 అడుగుల అల్లూరి విగ్రహాన్ని ప్రధాని మోదీ ప్రారంభించడం గొప్ప విశేషమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ నడింపల్లి కృష్ణంరాజు, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ విప్లవ వీరులు అతి తక్కువ కాలంలో మృతి చెందడం దురదృష్టకరమని, వారి చరిత్రలు మాత్రం చిరస్మరణీయంగా నిలుస్తున్నాయని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జేఎల్ బి, పిఎస్ఎం, డిఎన్నార్, ఎస్ సీహెచ్ బీఆర్ హైస్కూల్లో విద్యార్థులకు అల్లూరి ఆశయాలు నెరవేరుద్దాం .. అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి 4న జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, కలిదిండి.ప్రసాద్ రాజు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిల్వ ఆహారాన్ని తీసుకోరాదు



వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటిలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినరాదని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జి.రూపాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూపాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. నీళ్ల విరోచనాల లక్షణాలు ఉంటే దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలన్నారు. అక్కడ అందించే ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ద్వారా నీళ్ల విరోచనాలను నివారించవచ్చన్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా పరిశుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతిర్మయి, హెచ్ఎస్ లక్ష్మణ్, ఫార్మాసిస్ట్ రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.బేబి, డి.ఏస్తేరు రాణి, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆచంటకు తణుకు మీదుగా బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తణుకు రైల్వే ఇంజనీర్ ఆదేశాలు మేరకు ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి 5వ తేదీ శుక్రవారం వరకు అత్తిలి–మంచిలి రైల్వే లైన్ మరమ్మతులు నిమిత్తం మంచిలి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లిగూడెం డిపో నుంచి అత్తిలికి ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి ప్రతి రెండు గంటలకు ఒక బస్సు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఆచంటకు తణుకు మీదుగా బస్సులు నడుపుతున్నట్లు, మార్పును గమనించాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జీఐఎస్ విద్యుత్ ఉపకేంద్రం వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 3వ తేది బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలో బుధవరం మార్కెట్, మెంటేవారి తోట, శ్రీనివాస సెంటర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, గులాబీ సెంటర్, మారుతి టాకీస్, బస్టాండ్ ఏరియా, రిలయన్స్ సూపర్ మార్కెట్, కళాభవన్ ప్రాంతం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈ.ఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

పాడి పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు శ్రద్ధ వహించాలని పట్టింపాలెం సర్పంచ్ బొనిగే పోతన అన్నారు. మంగళవారం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో ఆవులకు ముద్ద చర్మ రోగం నివారణకు ముందస్తు టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోతన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా టీకాలు చేయించడం వల్ల పాడి పశువులను సంరక్షించుకోవచ్చన్నారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీవీ.విజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాలు, పశువైద్యశాలల్లో ఆవులకు ముద్ద చర్మ రోగం నివారణ టీకాలు, గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. గ్రామంలో 93 పాడి పశువులకు టీకాలు వేశారు. అలాగే ఆరుగొలను గ్రామంలోనూ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పీతల బుచ్చిబాబు ప్రారంభించారు. ఆరుగొలను పశువైద్యాధికారి డాక్టర్ టి.దివ్యశ్రీ మాట్లాడుతూ పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆరుగొలనులో 48, కొత్తూరులో 43 పాడి పశువులకు టీకాలు వేసినట్లు వివరించారు. పాడి రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో వాసవీ హోమం



పెనుగొండ వాసవీ శాంతి థాంలో వాసవీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో మంగళవారం వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాయచూర్, కల్యాణ దుర్గం, అనంతపురం పరిసర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి మంగళవారం ఉదయం నుంచి గోమాత పూజ, వాసవీ మాతకు పంచామృతాభిషేకం, దంపతుల పూజ నిర్వహించారు. మరకత శిల వాసవీ మాతకు అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

డయేరియాపై ఇంటింటా సర్వే



డయేరియాపై గ్రామంలో ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: డయేరియాపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఎన్ఎం డి.సరళా ప్రకాష్ కోరారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ నాగరాజుపేటలో వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం డయేరియాపై ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా వాంతులు, విరోచనాలతో బాధపడుతుంటే సంబంధిత వైద్య సిబ్బంది వద్దకు వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. అలాగే ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ధనాని బాబాజీ, ఎంఎల్‌హెచ్‌పీ కె.ఝాన్సీ, ఆశ వర్కర్లు పి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త న్యాయ చట్టాలను రద్దు చేయాలి

ఆకివీడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త న్యాయ చట్టాలను రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక శాంతినగర్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ ప్రజల హక్కులను హరించేలా కొత్త న్యాయ చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని అమలును తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్రక్కు డ్రైవర్లను క్రిమినల్స్‌ను చేస్తూ ఐదేళ్లు శిక్ష పడే విధంగా కేంద్రం పూనుకుంటోందని ఆరోపించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెంకి అప్పారావు, టీ.కృష్ణ, బొర్రా శ్రీను, సత్యం పాల్గొన్నారు.

మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఆకివీడు: ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళ్లి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కన్పించదన్నారు. సంస్థ మొబైల్ యాప్ ఈస్టర్న్ పవర్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సంస్థ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఈస్టర్న్‌పవర్.కామ్ నుంచి బిల్లులు చెల్లించొచ్చని సూచించినట్లు అహ్మద్ ఖాన్ తెలిపారు. వినియోగదారులు తమ ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాల్లెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని వివరించారు. ఈ మార్పును వినియోగదారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణ పరమాత్మకు పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో కృష్ణపరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జేష్ఠ బహుళ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగధ్యాన మందిరంలోని కృష్ణపరమాత్మకు ఆలయ అర్చకులు ఆదూరి సాయిచే పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. సామూహిక భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణంలు చేశారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు సమీపంలోని యాళ్లవాని గరువులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తామని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి పాలకొల్లు పట్టణ, యలమంచిలి, పోడూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

స్వచ్ఛతకు ఓఎన్‌జీసీ కృషి



ఓఎన్‌జీసీ సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్యామలాసోని

పెనుగొండ: స్వచ్ఛ భారత్ కోసం ఓఎన్‌జీ సంస్థ స్వచ్ఛత పక్వాడ్ ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మంగళవారం పెనుగొండ పంచాయతీ వద్ద ప్రజలకు అవగాహన కల్పించి, పంచాయతీ సిబ్బందికి టీ షర్ట్‌లు, క్యాప్‌లు, ఇతర సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ రిగ్ ఇంచార్జ్ డి.సుబ్బారావు, సీఎస్ఆర్ టీం రాజమండ్రి ఎసెట్ అధికారులు, గ్రామ కార్యదర్శి టి.రత్నాకరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా మహాసభను విజయవంతం చేయండి

వీరవాసరం: పాలకొల్లులో నిర్వహిస్తున్న ఆక్వా మహాసభను విజయవంతం చేయాలని వీరవాసరం మండల ఫ్రాన్ ఫార్మర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్ల రాంబాబు మంగళవారం పిలుపునిచ్చారు. రొయ్యల సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలపై చర్చించడానికి సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రొయ్యలకు ధరలు లేక పెరిగిన మేతలు, మందులు ధరల తాకిడితో రొయ్యల రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క రొయ్యల రైతు తప్పనిసరిగా ఆక్వా రైతు మహాసభకు హాజరు కావాలని కోరారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆక్వా రైతుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా రైతులు రొయ్యలు, చేపలను కష్టపడి పండిస్తున్నారని తెలిపారు. ఆక్వా రైతుల కృషి వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ఎంపెడ, ఫిషరీస్ డవలప్మెంట్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం, మత్స్య శాఖ ఆక్వా రైతుల సమస్యలను పట్టించుకొని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల సమస్యలపై రైతాంగం చేసే ఉద్యమాలకు, పోరాటాలకు సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాత పసుమర్తి హనుమంతరావు (అనిల్) ఆర్థిక సహకారంతో కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 87 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి చంద్రశేఖర్ శ్రీనివాసరావు, సుంకర శ్రీనివాసరావు, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, రామోహన్ రావు, సూర్యనారాయణ మూర్తి, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.